సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 17 । అక్టోబర్ । 2024



జగన్‌పై కక్ష.. రైతాంగానికి శిక్ష.!

ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రైతాంగం కోసం గత సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులపై ప్రస్తుత చంద్రబాబు సర్కార్ కక్ష గట్టి రైతాంగాన్ని శిక్షిస్తోంది. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కడప -రాయచోటి మార్గంలోని మేదరపల్లి చెక్ పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 121 మెట్రిక్ టన్నులు



వామ్మో.. ఎంత పెద్ద చేప.!



మొలకవారిపల్లె చెరువులో చిక్కిన పెద్ద చేపను చూపుతున్న బాలచంద్రారెడ్డి

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు గ్రామం మొలకవారిల్లెలోని నల్ల బయ్యమ్మ చెరువులో బుధవారం నివ్వెర పోయే చేపలు కన్పించాయి. వివరాలలోకి వెళితే...గత మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఎన్నాళ్లగానో చెరువులో ఉన్న మారవ చేపలు కొత్తగా వస్తున్న నీళ్లకు ఎగబడ్డాయి. కమతంపల్లెకు చెందిన కమ్మల గంగిరెడ్డి కర్ర సాయంతో ఏడు కిలోల దాకా బరువు, మీటరు పొడవున్న మూడు చేపలను పట్టుకున్నాడు. వీటిని గ్రామానికి చెందిన తుంగా బాలచంద్రారెడ్డి తదితరులు ఎగబడి తీసుకున్నారు. ఈ చెరువులో ఆరేళ్లుగా నీళ్లు తగ్గకుండా ఉన్నాయి. గతంలో ఆ ఊరికి చెందిన ఒకరు చేపలు వదిలారు. అవి క్రమేణా పెద్దవి అయ్యాయి. ఐదేళ్లుగా ఈ చెరువులో వివిధ ప్రాంతాలకు చెందిన వారు గాలాలు, వలలతో చేపలు పట్టుకుంటున్నారు. చెరువులో నీళ్లు తగ్గకుండా ఉండడంతో తరగని విధంగా ఇవి మరింతగా వృద్ధి చెందుతూ వచ్చాయి. ఇప్పుడు బయటపడ్డ భారీ చేపలను చేత పట్టుకుని భలే భలే చేపలు చూడు మామా అంటూ గ్రామస్తులు సంబరపడుతున్నారు.

వాయు గండం.!

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచారు.

- జిల్లాలో మూడురోజులుగా ఎడతెరిపిలేని వర్షం
- రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు
- కోడూరులో వైద్య శిబిరాలు
- వర్షంపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్



రైల్వేకోడూరు మండలంలో పోటెత్తి ప్రవహిస్తున్న గుంజన నది

రాయచోటి : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వాయుగుండంగా మారడంతో దీని ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించి పోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనం రోడ్డు ఎక్కడానికి జంకుతున్నారు. కొద్దిపాటి తెరపు కనిపించిన వెంటనే గొడుగులు పట్టుకుని పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. వాహనదారులు సైతం ఈ వర్షపు జల్లులతో ఇబ్బంది పడుతున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రానికి 136 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోడూరులో 136 మిల్లీ మీటర్ల మేర నమోదు కావడం గమనార్హం. అదే స్థాయిలో పుల్లంపేటలో 93 మిల్లీ మీటర్లు, ఓబులవారిపల్లెలో 81, చిట్వేలిలో 70 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. అయితే మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో వర్షం కురిసినా పెద్ద ప్రభావమేమీ కనిపించ లేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో రాజంపేటలో వరిపంట నీట మునిగింది. కోడూరులో పండ్లతోటల నిండా నీరు చేరంది. ఈ వర్షం గురువారానికి తీవ్రతరమయ్యే అవకాశం ఉందన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో ఒక చెరువు కూడా నిండకపోవడం కొంచెం నిరాశ కలిగిస్తోంది.

కలెక్టర్ సమీక్ష..

జిల్లాలో కురుస్తున్న వర్షాలపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాయచోటి, రాజంపేట, మదనపల్లి సబ్ డివిజన్ల అధికారులతో సమీక్షిస్తున్నారు. డ్రోన్ల సాయంతో నదులు, చెరువుల పరిస్థితులపై వీడియోలు, ఫొటోలతో స్థానిక అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

రాకపోకలకు అంతరాయం

గాలివీడు : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాలివీడులో బుధవారం సాయంత్రం వరకు 35.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల వ్యాప్తంగా చాలాచోట్ల రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కూలిన ఇల్లు

రామాపురం : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెలో చీకటి జయరామయ్యకు సంబంధించిన ఇల్లు బుధవారం కూలిపోయింది. గ్రామ పంచాయితీ సెక్రటరీ, వీఆర్ఓ, సర్పంచ్ ఆంజనేయులు తదితరులు సంఘటన స్థలానికి వెళ్లి ఇంటిలోని కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

వైద్య శిబిరాలు..

అల్పపీడన ద్రోణి ప్రభావం వలన వర్షంతో నీరు నిలిచిన గ్రామాలలో అంటువ్యాధులు, డయేరియా ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలో భారీ వర్షంతో నీరు నిలిచిన గ్రామాలు గంగెద్దులమిట్ట, జానకీపురం, శెట్టిగుంట పీహెచ్‌సీలలోని శ్రీనివాసపురం, రైల్వేకోడూరులోని నారాయణ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరం, క్యాంపులో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందజేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ)	మండలం	వర్షపాతం (మి.మీ)
		కురబలకోట	43
		కుంభంవారిపల్లి	42
పెనగలూరు	66.8	టి.సుండుపల్లి	40.6
రైల్వేకోడూరు	62.8	వీరబల్లి	38.8
నందలూరు	62.6	లక్కిరెడ్డిపల్లి	38
చిట్వేలి	62.4	చిన్నమండెం	36.4
పుల్లంపేట	61.8	వాల్మీకిపురం	34.2
సంబేపల్లి	58	గాలివీడు	33.6
కలికిరి	51.4	మదనపల్లి	32.4
రాయచోటి	48.2	పెద్దమండ్యం	31
ఓబులవారిపల్లి	47	రామాపురం	27.4
గుర్రంకొండ	46.6	పెద్దతిప్పసముద్రం	26.8
నిమ్మనపల్లి	45.4	తంబళ్లపల్లి	24.4
కలకడ	44	బి.కొత్తపేట	23.4
రాజంపేట	44	ములకలచెరువు	23.8
పీలేరు	44	రామసముద్రం	23.4

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



రాయచోటి టౌన్/ రాజంపేట రూరల్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. దీంతో అధిక వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించవచ్చన్నారు. పిల్లలను ఎట్టి పరిస్థితిలో ఇంటి నుంచి బయటకు పంపరాదన్నారు. ఎడతెరిపి లేని వానలకు పాత భవనాలు, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారవచ్చన్నారు. వాటికి దగ్గరగా వెళ్లడం కానీ తాకడం కానీ చేయరాదన్నారు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ఆయా ప్రాంతాల వారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

▸▸ పంటలకు దెబ్బ



వరి పంట దెబ్బతిందని చూపుతున్న రైతు

వాల్మీకిపురం : మండలంలోని వరి, టమాటా, మునగ, వంకాయ తదితర పంటలన్నీ దెబ్బతిన్నాయి. దీంతో రైతుల ఆశలు అడియాశలుగా మారాయి. పట్టణానికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి ఒకటిన్నర ఎకరంలో వేసిన వరి పంటలో అర్ధభాగం వాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే గొల్లపల్లిమిట్ట వద్ద రైతు శేఖర మునగ పంట దెబ్బతిందని వాపోయాడు. పలు చోట్ల వరి పంట పక్కకు వాలిపోయింది. టమాటా, వంకాయ పంటలు దెబ్బతిన్నాయని పలువురు రైతులు వాపోయారు.

▸▸ వరి పంట నేలమట్టం



సుండుపల్లెలో నీట మునిగిన వరి మడి

సుండుపల్లె : పంటలు చేతికందే సమయంలో అకాల వర్షంతో పంటలు దెబ్బతినడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. మండల పరిధిలోని ఏటిగడ్డ రాచపల్లి సమీపంలో బండి తిరుపాల్ అనే రైతు 1.5 ఎకరాలు వరిపంటను కౌలుకు చేస్తున్నాడు. పంట పూర్తిగా నేలమట్టమై నీటిలో మునిగిపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. పెద్ద బలిజపల్లెలో వర్షం ధాటికి వరిపంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. నీటమునిగిన పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

▸▸ జలమయం



జిల్లేలమడక చెరువుకు చేరుతున్న నీరు

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె మండలంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు వర్షపునీటి ప్రవాహాలుగా మారాయి. మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు చేరింది. శేషాచలం అడవిలో భారీ వర్షం కురవడంతో వంకలు, వాగులు పొంగి పొర్లాయి. మండలంలోని జిల్లేలమడక చెరువుకు భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

▸▸ గుంజనకు వరద ముప్పు



వైఎస్సార్‌సీపీ నాయకుల సహాయక చర్యలు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంజన ఏటికి వరద ముప్పు పొంచి ఉంది. ఎమ్మెల్యే శ్రీధర్, సబ్ కలెక్టర్ మైఖోమ్ నదియాదేవి, సీఐ హేమసుందర్‌రావులు ముంపు ప్రాంతాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్ తదితరులు పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. వాసవీక్లబ్ వారు వరద బాధిత ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వెలిగల్లు జలాశయం పరిశీలన



వెలిగల్లు జలశయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గాలివీడు : మండలంలోని వెలిగల్లు జలాశయాన్ని బుధవారం తహసీల్దార్ భాగ్యలత పరిశీలించారు. వెలిగల్లు జలాశయం సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.369 టీఎంసీల నీటి మట్టానికి చేరుకుందన్నారు. వర్షం కారణంగా ఎగువప్రాంతం నుంచి 245 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, 22 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజెక్టు డీఈ ఆర్.ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన సబ్ కలెక్టర్



మదనపల్లె మండలంలో కదిరమ్మ చెరువు కట్టను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె/నిమ్మనపల్లె: మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లోని చీకలబైలు పంచాయతీ కదిరమ్మచెరువు, వెంకటమ్మ చెరువు, బహుదా ప్రాజెక్టును సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ బుధవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైన ప్రజలు కంట్రోల్ రూములోని ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్లు ఖాజాబీ, ధనంజయులు, ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డి, డీఈ కేడీఆర్ ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఏఈ శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి పంటలకు నష్టం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలోని చింతరాజుపల్లి, మంటపంపల్లి, కోనరాజుపల్లి, నరసన్నగారిపల్లి గ్రామాలలో దాదాపు 90 ఎకరాలు వరిపంట నేలకొరిగిందని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అల్పపీడనం తగ్గుముఖం పట్టిన తరువాత ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందన్న వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

భారీ వర్షాలకు పాడి పశువులు మృతి

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాడి పశువులు మృతి చెందాయి. ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ, మండల పశువైద్యశాఖ ఏడీ ఉమ వివరాల మేరకు చిన్నకొత్తపల్లిలో అధిక వర్షంలో తడిసి ఒకే రైతుకు చెందిన ఒక గేదె, ఒక దూడ మృతి చెందగా, మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీ, భోగేపల్లి గ్రామంలో ఒకే రైతుకు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి.



భోగేపల్లిలో మృతి చెందిన ఆవు





కోడూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం

డ్రోన్ కెమెరాతో రైల్వేకోడూరు ప్రాంతంలో ఉన్న చెరువు పరిస్థితిని చిత్రీకరించిన దృశ్యం


అంతా మా ఇష్టం.!

- బి.కొత్తకోట, కురబలకోట ఎంపీడీఓల రూటే సపరేటు
- అధికారిక సర్క్యులర్లు, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారంలో ఎమ్మెల్యే, ఎంపీ పేర్ల తొలగింపు
- ప్రజాప్రతినిధి కాని టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి పేరు చేర్చిన వైనం
- చట్టసభల సభ్యులను అగౌరవ పరుస్తూ.. టీడీపీకి కొమ్ముకాస్తున్న ఎంపీడీఓలు


సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఒక నియోజకవర్గానికి కీలక ప్రజాప్రతినిధి శాసనసభ్యుడు. తర్వాత పార్లమెంటు సభ్యులైతే..ప్రజలచేత ఎన్నుకోబడిన మిగిలిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వారికి లభించిన స్థాయిని బట్టి గౌరవం దక్కుతుంది. అధికారిక, ప్రభుత్వ కార్యక్రమాల ఉత్తర్వులు, సర్క్యులర్లలో ప్రాధాన్యత క్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పేర్లను ఉటంకిస్తూ జారీ చేస్తారు. అయితే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, కురబలకోట ఎంపీడీఓలు మాత్రం స్థానిక సంస్థల ప్రతినిధులనే కాదు చట్టసభల ప్రతినిధులైనా మాకేంటి.. అంతా మా ఇష్టం అంటూ టీడీపీ నేతల్లా వ్యవహరిస్తున్నారు. ఉత్తర్వులు, సర్క్యులర్లలో వారి ప్రస్తావనే లేకుండా అగౌరవ పరుస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు తెలపకనే..

గతనెల 20 నుంచి 26వ తేదీ వరకు బి.కొత్తకోట మండలంలో ఇది మంచి ప్రభుత్వం పేరుతో కార్యక్రమాల నిర్వహణ జరుగుతుందని ఎంపీడీఓ శంకరయ్య సర్క్యులర్ జారీ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులకు తెలిజేయస్తూ సర్క్యులర్ ఇవ్వాలి. అలా కాకుండా కేవలం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పై స్థాయి అధికారులకు మాత్రమే సమాచారం ఇస్తూ సర్క్యులర్ జారీ చేశారు. పై పేర్కొన్న ప్రజాప్రతినిధులంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కావడంతో వారిలో ఒక్కరికి కూడా సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించేశారు. దీంతో నియోజకవర్గంలో, గ్రామ స్థాయిలో ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టింది, అందుకు నిధులు మంజూరు చేసిందా, నిధుల వినియోగం జరిగిందా లేదా అన్న విషయాలు కాని, కార్యక్రమంలో ఏమైనా నిర్ణయాలు జరిగాయా అన్నది పూర్తిగా తెలియకుండా పోయింది. ప్రభుత్వ కార్యక్రమం అయితే నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేను ఆహ్వానించాలి. అయితే ఇవేమీ పట్టించుకోకుండా సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు.



బి.కొత్తకోట ఎంపీడీఓ జారీచేసిన సర్క్యులర్‌లో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పేరు



కురబలకోట ఎంపీడీఓ సర్క్యులర్‌లో మొదటి స్థానంలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి పేరు

ఇన్‌చార్జి వస్తారని 'గమనిక'

బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లెలో గత నెల 26న జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి డి.జయచంద్రారెడ్డి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే ఎమ్మెల్యేను కాదని ప్రజాప్రతినిధికాని టీడీపీ నాయకుడికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో స్పష్టమవుతోంది.

టీడీపీ ఎమ్మెల్సీకి టీడీపీ ఇన్‌చార్జి పేరుతో..

బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లెలో గత నెల 26న అధికారికంగా జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి జిల్లాకు సంబంధంలేని టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరవుతారని జారీ చేసిన సర్క్యులర్‌లో ఆయనను తంబళ్లపల్లె ఇన్‌చార్జిగా పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని నియోజకవర్గ టీడీపీ సభ్యుడిగా పేర్కొంటూ ఎమ్మెల్యే పదవిని అవమానించేలా ఈ పేరు కింద శాసనసభ్యులు, తంబళ్లపల్లెవారికి సమాచారం నిమిత్తం అని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పల్లె పండుగ సర్క్యులర్‌లో కూడా ఇదే విధంగా ఎమ్మెల్యే పదవికి గౌరవం ఇవ్వలేదు. టీడీపీ సభ్యుడు జయచంద్రారెడ్డి అని పైన పేరు పెట్టి కింద శాసన సభ్యులకు అని సూచించారు.

గంగయ్యదీ ఇదేతీరు..

కురబలకోట ఎంపీడీఓ గంగయ్య కూడా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. పల్లె పండుగ కార్యక్రమ నిర్వహణ సర్క్యులర్ జారీలో టీడీపీ పట్ల తన వైఖరిని చాటుకున్నారు. ఈ సర్క్యులర్‌లో మొదట స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు కాకుండా టీడీపీ నాయకుడు డి.జయచంద్రారెడ్డి పేరుతో ప్రారంభించి ఎమ్మెల్యే పదవిని అగౌరవ పరిచారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే పదవికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పనిచేసిన గంగయ్య టీడీపీకి కొమ్ముకాసి పని చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

యువరాజ్‌కు బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు



మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్

కురబలకోట : మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ–24) మేనేజ్‌మెంట్ కమిటీ ఏటా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు జి. కృష్ణకుమార్ స్మారక రాష్ట్ర అవార్డును ప్రదానం చేస్తారు. ఈసారి యువరాజ్‌కు దక్కింది. కర్నూలులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25న అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. మిట్స్ కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు యువరాజ్‌ను అభినందించారు.

క్లుప్తంగా

వైభవంగా పవిత్ర సమర్పణ



పవిత్రాలను తీసుకెళ్తున్న వేదపండితులు

వాల్మీకిపురం : టీటీడీ అధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర సమర్పణ కార్యక్రమం కనులపండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర సమర్పణ తదితర కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు క్రిష్ణప్రసాద్ భట్టార్, క్రిష్ణరాజుభట్టర్, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో గురువారం యాగశాల వైదిక కైంకర్యములు, మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ, తిరువీధి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు



ఆర్టీసీ బస్సు-కారు ఢీకొన్న దృశ్యం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె పరిధిలోని ఆర్టీపీపీ పవర్ గ్రిడ్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాయచోటి నుంచి వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్ల కారణంగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వీటిని సత్వరమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు ఘాట్‌లో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షానికి గువ్వలచెరువు ఘాట్‌లోని జలపాతానికి నీళ్లు రావడంతో గువ్వలచెరువుకు చెందిన షేక్ కరీంసాబ్ జలపాతాన్ని చూడడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని ఆటోనగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

జగన్‌పై కక్ష.. రైతాంగానికి శిక్ష

- పుంగనూరు ఉపకాలువ విస్తరణ 'కృష్ణా'ర్పణం
- హంద్రీ-నీవా ప్రాజెక్టులో కీలకమైన పీబీసీ విస్తరణకు బాబు సర్కార్ బ్రేక్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,217.49 కోట్లతో చేపట్టిన పనులు నిలిపివేత
- కొత్తగా లైనింగ్ పనుల ప్రతిపాదనలకు ఆదేశాలు
- రూ.4,373 కోట్లతో చేపట్టిన జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం పనులు నిష్ఫలం



విస్తరణ పనులు ఆపేయడంతో బి.కొత్తకోట వద్ద నిలిపిన టిప్పర్లు, పొక్లెయిన్లు, వాహనాలు



పుంగనూరు ఉప కాలువ



తంబళ్లపల్లె నియోజకవర్గం మద్దయ్యగారిపల్లె వద్ద కాలువ విస్తరణ పనులు ఆపేసిన దృశ్యం

బి.కొత్తకోట : కరువు రైతాంగానికి పుష్కలంగా సాగునీరు, ప్రజలకు తాగునీటిని అందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులపై చంద్రబాబు సర్కార్ కక్ష కడుతోంది. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రైతాంగం విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రస్తుత చంద్రబాబు సర్కార్ కక్ష గట్టి రైతాంగాన్ని శిక్షిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో చేపట్టిన మూడు రిజర్వాయర్ల పనులు జరగకుండా టీడీపీ నేతల ద్వారా ఎన్‌జీటీలో ఫిర్యాదు చేయించి పనులు ఆపివేయించారు. ఈ మూడు రిజర్వాయర్లు పీబీసీ విస్తరణ పనులపై ఆధారపడి ఉండటం గమనించాల్సిన విషయం. వేల కోట్ల ప్రాజెక్టుల పనులపై తీవ్ర ప్రభావం చూపేలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపట్టిన ఏవీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టు ఫేజ్-2 పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) విస్తరణ పనులను ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నిలిపివేశారు. 2022 సెప్టెంబర్, 26న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఈ పనులకు టెండర్ల నిర్వహణ పూర్తి చేశాక, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం కూడా జరిగింది. దీనితో సంస్థ మదనపల్లెలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు సంబంధించిన పనులు చేపట్టగా, గతనెల 26న అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం మద్దయ్యగారిపల్లె వద్ద పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. సరిగ్గా మూడు వారాలకే పనులు నిలిపివేయించారు.

1,180 క్యూసెక్కులకు విస్తరణ

ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పులికల్లు వద్ద కిలోమీటర్ 79 నుంచి పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం తిమ్మిరెడ్డిగారిపల్లె వద్ద 220.350 కిలోమీటర్ వరకు పీబీసీ సాగుతుంది. దీని నీటి ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు. సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఈ కాలువ ద్వారా ఇక్కడికి తరలిస్తారు. ఈ కాలువ సామర్థ్యం మరో 800 క్యూసెక్కులకు పెంచి మొత్తం 1180 క్యూసెక్కులతో పుష్కలంగా కృష్ణాజలాలను తరలించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులకు 2021లో రూ.1,929 కోట్లతో పాలనాపరమైన అనుమతి ఇవ్వగా రూ.1,219.9 కోట్లకు సాంకేతిక అనుమతి ఇచ్చారు. ఈ నిధులతో 2022 సెప్టెంబర్ 26న నిర్వహించిన రివర్స్ టెండర్లలో రూ.1,217.49 కోట్లకు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుంది. తర్వాత చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సంబంధించిన పనులు చేపట్టగా ప్రభుత్వం రూ.177 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. కాలువ విస్తరణ పనులను గత నెలలో మొదలు పెట్టారు. కాలువ మొదలయ్యే పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో పనుల కోసం భారీ యంత్రాలు, ఇతరా వాహనాలు, సిబ్బందిని రంగంలోకి దింపింది. కాలువ మట్టి పనులు మొదలయ్యాయి. ఉన్నట్టుండి బుధవారం పనులు నిలిపివేయాలని ప్రాజెక్టు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఎక్కడిపనులు అక్కడే ఆపివేశారు.

మూడు రిజర్వాయర్లు ఎండబెట్టాలనే..

కరువుకు నిలయమైన తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల రైతులకు కృష్ణా జలాలతో కష్టాలు తీర్చాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణం కోసం రూ.2,144.50 కోట్లు మంజూరు చేసింది. ఇందులో నిర్మాణాలకు రూ.1,529.37 కోట్లు కేటాయించగా మూడు రిజర్వాయర్ల పనులను కాంట్రాక్టు సంస్థలు రూ.1,553.96 కోట్లతో దక్కించుకుని పనులు చేపట్టాయి. ఈ పనులతో వైఎస్సార్‌సీపీకి రైతులు, ప్రజల్లో మద్దతు పెరుగుతుందని కుట్రలు, కుతంత్రాలతో ఎన్‌జీటీలో కేసులు వేయించి పనులు ఆగిపోయేలా చేశారు. ప్రధానంగా ఈ రిజర్వాయర్లకు 6.5 టీఎంసీల కృష్ణా జలాలు తరలించాలంటే పీబీసీ కాలువ విస్తరణ పనులు పూర్తి కావాల్సిందే. ఈ కాలువ ద్వారానే నీటిని మళ్లించి నింపుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రస్తుత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై కక్ష తీర్చుకుంటోంది. పీబీసీలో నీటి ప్రవాహ సామర్థ్యం పెరగకుంటే వీటికి చుక్కనీరు కూడా అందదు. తద్వారా రిజర్వాయర్లకు నీటిని తరలించకుండా, 70వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 40వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాగులోకి రానివ్వకుండా ఎండబెట్టి జగన్ ప్రభుత్వంపై ఉన్న కక్షతో రైతాంగాన్ని శిక్షిస్తోంది.

అనుసంధాన పథకాన్ని ముంచినట్టే..

పీబీసీ విస్తరణ పనుల నిలిపివేతతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల అనుసంధాన పనులను చంద్రబాబు సర్కార్ ముంచినట్టే. వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 13 టీఎంసీల కృష్ణా జలాలను తరలించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలయజ్ఞం చేసింది. ఈ పథకానికి 5,030 కోట్లు మంజూరు చేయగా రూ.4,373.23కోట్లతో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టింది. ఇందులో రూ.1,100 కోట్ల పనులు పూర్తి చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను కాలేటివాగు, కల్లూరుపల్లె రిజర్వాయర్, వెలిగల్లు జలాశయానికి తరలించి అక్కడినుంచి ప్రస్తుత అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి నీటిని తరలించాక పైప్‌లైన్, రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పెద్దతిప్పసముద్రం వద్ద పీబీసీలోకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. పీబీసీ విస్తరణ పనులు ఈ నీటి తరలింపు కోసమే చేపట్టారు. ఈ నీటిని మూడు రిజర్వాయర్లకు, చెరువులకు మళ్లిస్తారు. ఇదే కాలువ ద్వారా కుప్పానికి నీళ్లు తరలిస్తారు. విస్తరణ పనులు నిలిపివేతతో అనుసంధాన ప్రాజెక్టు ప్రశ్నార్థకం కావడమేకాక చేసిన ఖర్చు నిష్ఫలమే అవుతుంది.

లైనింగ్‌కు ప్రతిపాదనలు ఇవ్వండి

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు నిలిపివేయించిన ప్రభుత్వం కాంక్రీటు లైనింగ్ కోసం ప్రాజెక్టు అధికారుల నుంచి మంగళవారం ప్రతిపాదనలు కోరింది. విస్తరణ పనులు నిలిపివేయాలని ఆదేశించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దతిప్పసముద్రం మండలం నుంచి గంగవరం వరకు సాగే కాలువకు లైనింగ్ పనులు, ఇతర కాంక్రీటు నిర్మాణాల కోసం ఎంత నిధులు అవసరం, చేపట్టాల్సిన పనులపై నివేదించాలని కోరింది. దీనిపై ప్రాజెక్టు ఎస్ఈ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచన మేరకు విస్తరణ పనులు నిలిపివేసినట్టు తెలిపారు. దానిస్థానంలో లైనింగ్ పనులకు ఎంత వ్యయం అవుతుందో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు.

సూపర్‌సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరవైఫల్యం



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

రాయచోటి అర్బన్ : ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమై ందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రావులు విమర్శిం చారు. బుధవారం పట్టణంలోని లిబరేషన్ కార్యాలయంలో పార్టీ జిల్లా జనరల్‌బాడీ సమావేశం జిల్లా కన్వీనర్ ఎం.విశ్వనాథ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల అమలును గాలికి వదలేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్‌సిలెండర్‌ల పంపిణీ అంటూ గాలి కబుర్లు చెబుతున్నారే తప్ప ఆచరణకు ముందుకు రావడం లేదన్నారు. తమ హామీల అమలు అంశంపై నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం తిరుపతి లడ్డూ కల్తీవ్యవహారంపై రాజకీయం చేస్తుండడం దారుణమన్నారు. మద్యం షాపుల ఏర్పాటుపై కూడా ఎన్నడూ లేనంతగా ప్రచారం, హంగామా చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారాన్ని మరుగుపరుస్తున్నారంటూ మండిపడ్డారు. ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారంపై శ్రద్ధచూపకపోవడం దారుణమన్నారు. లిబరేషన్ పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ డిసెంబర్ 4వతేదీన విజయవాడలో భారీఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, సత్తార్, జిల్లానేత చెన్నయ్య, ఏఐఎస్ఏ జిల్లానేత లవకుమార్, నేత లు రమణ, రఘునాథ, సుజాత, నీలావతి, ఆంజనేయులు, పెద్దన్నతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన జగదీష్ వద్ద అదే ప్రాంతానికి చెందిన దేవివరప్రసాద్ అలియాస్ దేవ ఎనిమిది నెలల క్రితం డబ్బు అవసరం పడటంతో రూ.40 వేలకు బుల్లెట్ వాహనాన్ని కదువపెట్టాడు. అయితే ఎంత కాలమైనా నగదు చెల్లించి వాహనం విడిపించుకోకపోవడంతో మంగళవారం రాత్రి జగదీష్ తన స్నేహితుడైన రెడ్డిబాషాతో కలిసి మల్లికార్జున సర్కిల్ వద్ద ఉండగా, దేవివరప్రసాద్ అక్కడ కన్పించడంతో నగదు చెల్లించి వాహనం ఎప్పుడు తీసుకెళ్తావని ప్రశ్నించాడు. దీంతో నలుగురిలో డబ్బులు అడుగుతావా అంటూ దేవీవరప్రసాద్ స్నేహితులైన సురేష్, వెంకి, భాస్కర్‌లతో కలిసి జగదీష్, రెడ్డిబాషాలపై దాడికి పాల్పడ్డారు. ఘటనలో జగదీష్ గాయపడగా బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులైన దేవీవరప్రసాద్, సురేష్, వెంకి,భాస్కర్‌లపై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : సీకేదిన్నె మండలంలోని పెద్దకాంపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన మహిళ నూకబోయిన నాగలక్ష్మి (38) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శంకర్ నాయక్ తెలిపారు. ఈమె భర్త రవి ఏడు సంవత్సరాల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి మనోవేదన పడుతూ జీవితంపై విరక్తి చెందిన ఇంటిలోని రేకుల షెడ్డుకు ఉండే పైపునకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందిందన్నారు. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు.

ఫ్లైయాష్ టిప్పర్ బోల్తా

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ఐసీఎల్ ఫ్యాక్టరీ సమీపంలోని ముద్దనూరు రోడ్డులో బుధవారంఫ్లైయాష్ బూడిద టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా బూడద పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే బూడిదను మరో టిప్పర్‌లోకి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్



రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడిగా కడప జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) గా పని చేస్తున్న సీవీ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (పిఎస్) బి. రాధాకృష్ణలను ఎన్నుకున్నారు. ఇందుకు ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర , ఆలీఖాన్, చెంగలరెడ్డి ,ఉమాకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తులు ఫెడరేషన్‌కు ఎన్నుకోవడం పట్ల సమస్యల పరిష్కారానికి నాంది పలుకుతుందని తెలిపారు. జీవో 117 రద్దు, పీఆర్‌సీ, ఐఆర్ ,పెండింగ్ బకాయిలు, పదోన్నతుల్లో అసంబద్ధాలు, సీపీఎస్ రద్దు మొదలగు సమస్యలపై ప్రభుత్వంతో ప్రాతినిధ్యాలు చేస్తూనే పోరాటాలకు శ్రీకారం చుడదామని నూతన రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

డీటీఓ పి.గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్‌ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు దసరా పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు 283 ప్రత్యేక బస్సులను నడిపారు. 148360 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పడం ద్వారా రూ.59,38,002 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. విజయవాడకు 26 బస్సులు 21016 కిలో మీటర్ల తిప్పడంతో రూ.877015, బెంగళూరుకు 69 బస్సులు 40472 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 1621619, హైదరాబాద్‌కు 54 బస్సులు 46884 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ.1576594 ఆదాయం వచ్చిందన్నారు. చెన్నైకి 11 బస్సులు 7539 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 338078 ఆదాయం సమకూరిందన్నారు. తిరుపతికి 46 బస్సులు 19827 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 868022 ఆదాయం వచ్చిందన్నారు. కర్నూలుకు 8 బస్సులు 3396 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 152956 ఆదాయం వచ్చిందన్నారు. ఇతర ప్రాంతాలకు 24 బస్సులు 9226 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ.503718 ఆదాయం ఒనగూరిందన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించి ప్రయాణించి ఆదాయం వచ్చేందుకు తోడ్పడిన ప్రయాణికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు.

జైలు శిక్షపడి పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న సీఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : చెక్కు బౌన్స్ కేసులో ఏడాది పాటు జైలు శిక్షపడటంతో పరారైన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. వివరాలిలా.. ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన పోలు మహేష్ అనే వ్యక్తి పెనగలూరు మండలం, సాతుపల్లి వద్ద చెల్లని చెక్కు ఇచ్చి నగదు తీసుకున్నాడు. చెక్కు బౌన్స్ కావడంతో నందలూరు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. దీంతో మహేష్ పరారయ్యాడు. హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శివనాగేంద్ర, శివనాగరాజులు చాకచక్యంగా పట్టుకొని రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ వద్ద హాజరుపరిచారు. మహేష్‌ను కోర్టులో హాజరుపరచగా సంవత్సరం జైలు శిక్ష విధించడంతో కడప సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం : కడప -రాయచోటి మార్గంలోని మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనల తనీఖీలు చేస్తుండగా ఇన్నోవా కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూండగా వాహనంతో సహా దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె సీఐ పర్యవేక్షణలో ముందస్తు సమాచారం మేరకు బుధవారం మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తుండగా కడప వైపు నుంచి టయోటా ఇన్నోవా కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు తరలిస్తూ వాహన తనిఖీలలో పట్టుబడ్డ నిందితుడు షేక్‌జిలాని బాషాను, ఇన్నోవా కారుతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ. 2లక్షలు వరకు ఉంటుందని తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకొని మృతి చెందిన శంకరప్ప

రామసముద్రం : తాగుడుకు బానిసై కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధ వారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం భూసానికురపల్లె గ్రామానికి చెందిన బుతన్న గారి శంకర(50) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై తరచు కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం యథావిధిగా కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్థాపం చెంది శీతరగానిపల్లి సమీపంలో ఓ పంట పొలంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

'విరామం' లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం



విరామం లఘుచిత్రం షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు : పీలేరుకు చెందిన విజయ్ క్రియేషన్స్ ప్రొడెక్షన్‌లో 'విరామం' లఘుచిత్రం షూటింగ్ ప్రారంభించారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట్లపల్లెలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్ర కథానాయికి సనాపై మహూర్తపు సన్నివేశం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు సరేష్ మాట్లాడుతూ స్నేహితుల మధ్య నమ్మక ద్రోహం అంశాన్ని ప్రధాన సారాశంగా తీసుకుని ట్రయాంగిల్ లవ్ స్టోరీతో చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక కామెడీ, యాక్షన్ సీన్స్ ఉంటాయని చెప్పారు. సమాజానికి ఉపయోగపడే చిత్రాలు నిర్మించడం తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత విజయ్‌కుమార్, కెమెరామెన్ మన్సూర్, నటీనటులు ఖాదర్‌బాషా, బాబ్జాన్, రాధాకృష్ణ, కిషోర్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, కృష్ణ, సుహేల్, మధు, చంద్ర, అను, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. బుధవారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఎనుమలవారిపల్లె, చిన్నగాండ్లపల్లె, రామిరెడ్డిగారిపల్లె ప్రాంతాల్లో వరి, కొబ్బరి చెట్లు, టమాట పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. సుధాకర్ మాట్లాడుతూ మూడు గ్రామాల్లో 15 మంది రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. అంచనాను వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో కలసి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఏనుగుల గుంపును పులిచెర్ల మండలం గంటావారిపల్లె అటవీప్రాంతాలకు తరిమినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు గిరి, జ్యోతి, వరదారెడ్డి, శోభ, హరినాథ తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



సతీష్ రాజు మృతదేహానికి లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండూరు సతీష్ రాజు అంత్యక్రియలు పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. రెండు రోజుల క్రితం విధుల నిర్వహణలో భాగంగా డ్యూటీకి వెళ్లుతున్న సమయంలో తన ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన స్వగ్రామం అయిన రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం వైకుంట రాచపల్లెలో బుధవారం ఎస్పీ విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ వరప్రసాద్ సిబ్బందితో అంత్యక్రి యలు నిర్వహించారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సులలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రవేశాల సంచాలకులు డా. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో విశ్వ విద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రాంగణంలో వున్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయం. (డీవోఏ)లో హాజరు కావాలని సూచించారు. ఏపీపీజీసెట్- 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం,ఎంపీఈడీ సబ్జెక్టుల వారీగా ఖాళీల ఉన్నాయని వివరించారు.

ఖాళీలు వివరాలు ఇలా..

ఇంగ్లీషు-35, తెలుగు -39, ఉర్దూ -26, జర్నలిజం-33, హిస్టరీ- 29, పొలిటికల్ సైన్స్- 26, ఎకనామిక్స్-41, కామర్స్ -37, బయో కెమిస్ట్రీ- 21, బయోటెక్నాలజీ -05, మైక్రో బయాలజీ -05, జెనెటిక్స్ సెండ్ జీనోమిక్స్-29, ఎన్విరాన్మెంటల్ సైన్స్ -31, బోటనీ -16, జువాలజీ-06, మ్యాథ్స్ -38, ఫిజిక్స్-26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ -34, కెమిస్ట్రీ -9, జియాలజీ -26, సైకాలజీ -24; ఫిజికల్ ఎడ్యుకేషన్ -38, ఫుడ్ టెక్నాలజీ -22; కంప్యూటర్ సైన్స్ -13, కాంపిటేషనల్ డేటా సైన్స్-27ఖాళీలు ఉన్నాయని ప్రవేశల సంచాలకులు తెలిపారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై వివాదం

ముద్దనూరు : మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన రెండు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభం కాలేదు. ఇందులో ఒక మద్యం దుకాణానికి సంబంధించి అధికార పార్టీలోని ఓ వర్గం మరో వర్గానికి మధ్య వివాదం నెలకొంది. పోట్లదుర్తి బ్రదర్స్ వర్గానికి చెందిన ఓ వ్యక్తికి మద్యం దుకాణం మంజూరైంది. ఈ దుకాణం ఏర్పాటుకు అనువైన అద్దెగది కోసం ప్రయత్నిస్తుండగా మరోవర్గం వారితో కడప రహదారిలోని ఓ పెట్రోలు బంకు వద్ద వివాదం నెలకొంది. వర్గపోరుతో మంగళవారం రాత్రి వరకు రెండు దుకాణాలు ఏర్పాటుకాకపోవడం గమనార్హం.